

పప్పు శనగకు 'కడి' తెగుళ్లు

- రైతుల్లో ఆందోళన...
- ఏడిఎ కార్యాలయానికే పరిమితం...
- గత ఏడాదితో పోల్చుకుంటే పెరిగిన సాగు విస్తీర్ణం

రబీలో సాగు చేసిన పప్పు శనగ పైరుకు కడి తెగుళ్లు సోకడంతో పైర్లను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సాగుచేసి పంటలు చేతికొచ్చేంత వరకు నమ్మకం చాలడం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.



కడి తెగులు సోకిన పప్పు శనగ పంట

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్లో పత్తికొండ 3452, దేవనకొండ 700, క్రిష్ణగిరి 281, వెల్దుర్తి 55, తుగ్గలి 787, మద్దికెర 7,102 హెక్టార్లలో శనగ సాగు చేశారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది శనగ సాగువిస్తీర్ణం పెరిగినట్లు అధికారుల అంచనా.. ఎకరా శనగ సాగు చేయడానికి రూ.20,000 పెట్టుబడి పెట్టాలని రైతులు చెబుతున్నారు. శనగ పైరుకు కడి తెగుళ్లు సోకడంతో పైర్లను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రయివేటు ఫర్టిలైజర్ యాజమాన్యాలు ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని పిచికారి మందులపై నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా పంటలపై సలహాలు ,సూచనలు అవగాహన కల్పించాలని చెప్పారు. డివిజన్‌కేంద్రంలో ఏడిఎ అధికారి కార్యాలయానికే పరిమితం అవుతున్నారని రైతు సంఘ నాయకులు మండిపడుతున్నారు. రైతులు సాగుచేసిన పైర్లకు తెగుళ్ళు వచ్చి నష్టపోతుంటే వ్యవసాధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించిన దాఖలు లేవని రైతులు చెబుతున్నారు. ఆయా మండలాలలో రైతు సేవా సిబ్బంది పంటలపై సూచనలు, సలహాలు ఇవ్వడం లేదంటూ రైతులు మొరపెట్టుకుంటున్నారు. పంట సాగు చేయడానికి చేసిన అప్పులు తీరుతాయా లేదో అని కన్నీరు మున్నీరవుతున్నారు. రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రతి సందర్భంలో రైతే రాజు, రైతన్న మీకోసం, పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాలు నిర్వహించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. ప్రచార ఆర్భాటం తప్ప నిర్దిష్టంగా రైతు సమస్యలను ప్రజాప్రతినిధులు , అధికారులు ప్రధానంగా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏమి చేయాలో తెలియడం లేదు..



ఆరు ఎకరాలలో శనగ పంటను సాగు చేశాను. దాదాపు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. పైరుకు కడి తెగుళ్లు సోకడంతో కాయలకు రాకముందే ముడుచు పోతున్నాయి. దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఏం చేయాలో తెలియడం లేదు.

- రైతు ముల్ల మాబు, హోసూర్ గ్రామం, పత్తికొండ మండలం.

సలహాలు, సూచనలు ఇవ్వడంలో వ్యవసాయాధికారులు విఫలం



రైతులు సాగుచేసిన పంటలపై సూచనలు, సలహాలు ఇవ్వడంలో వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలం చెందారు. శనగ పంట కడి తెగుళ్లు తో రైతు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించాలి. లేనిపక్షంలో రైతులను కలుపుకొని ఆందోళన చేస్తాం.

- ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దు

రైతులకు అందుబాటులోనే ఉన్నాం..



గత వారం రోజులుగా రైతన్న మీకోసం కార్యక్రమం ప్రజల్లోకి తీసుకెళ్లాం. ప్రతి బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆఫీస్ కార్యక్రమాలపై ఆఫీసులోనే ఉంటున్నాం. ఎల్లవేళలా రైతులకు అందుబాటులోనే ఉన్నాం. రైతుకు తగిన సూచనలు, సలహాలు ఇస్తాం.

- పత్తికొండ ఏడిఎ మోహన్ విజయ్ కుమార్.

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలి

- సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని నాలుగు రోడ్ల కూడలిలో సిపిఎం న్యూ సిటీకమిటీ ఆధ్వర్యంలో నగర నాయకులు ఎస్.శ్యామల, శాఖకార్యదర్శి రహిమాన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు ఎన్. అలివేలు మాట్లాడుతూ పదేళ్లనుంచి ప్రధాన రోడ్డు బళ్లారి రోడ్డులోని ఎల్లమ్మ గుడి నుండి వాసు హోటల్ వరకు ఉన్న ప్రధాన రహదారి పెచ్చులు లేచి చీలిపోయి అనేకమంది యాక్సిడెంట్లు అవ్వడానికి కింద పడి దెబ్బలు తగిలించుకోవడానికి కారణమైందన్నారు. తెల్ల బిల్డింగులు పచ్చ బిల్డింగులు పార్క్ ఏరియా, మేదర్ కాలనీ మట్టి పని కార్మికుల ఏరియాలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు లేవని, సూర్యనారాయణ నగర్ లో డ్రెయినేజీ నిర్మాణం కల్వర్టుల నిర్మాణం, నేతాజీ హౌసింగ్ కాలనీ, డిష్ ఏరియాలో భారీగా వర్షపు నీరు చేరి వర్షాకాలంలో చెరువులను తలపిస్తున్నాయన్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ ప్రాంతంలో దాదాపు 40,000 మంది జీవిస్తున్నారని, కనీసం స్మశాన వాటికకు స్థలం కేటాయించలేదని అన్నారు. వేలాదిమంది సొంత ఇల్లు లేక యేళ్ల తరబడి గుడిసెలలో మగ్గుతున్నారని, వారందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యక్తిగత ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, సొంత ఇల్లు లేని పేదలందరికీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెండు సెంట్లు స్థలాన్ని వెంటనే మంజూరు చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి నిధులను శాంక్షన్ చేయాలని, అనేకమంది అర్హులైన పేదలకు వృద్ధాప్య వికలాంగ వితంతు పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే డిసెంబర్ 15వ కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఈనెల 14లోపు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సిపిఎం నాయకులు జమ్మన్న, సత్యం, అనసూయ జయమ్మ అబ్బుల్ ఈరన్న తిమ్మన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నేషనల్ మీన్స్ కం-మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆదివారం కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలో 4124 మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకోగా 3960 మంది హాజరయ్యారు. ఇందులో 164 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 20 సెంటర్లు ఏర్పాటు చేశారు. కర్నూలులో ఆరు, ఆదోని 9, పత్తికొండ లో 9 కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాలలో పరీక్ష సజావుగా జరిగింది. ఇది జాతీయ ఆదాయ ప్రతిభ ఆధారిత వేతన పథక పరీక్షగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వం నిర్వహించే ఈ పరీక్షకు 8వ తరగతి విద్యార్థులు స్కాలర్షిప్ కోసం రాస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు ప్రతి నెలా స్కాలర్‌షిప్ అందుతుంది.



ఎన్ఎంఎంఎస్ పరీక్షను పర్యవేక్షిస్తున్న డిఇఒ శామ్యూల్ పాల్

జిజిహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు

-వైద్యం చేయడం కన్నా పర్యవేక్షణ క్లిష్టమైనది
-క్రిటికల్ కేర్ యూనిట్ బెడ్స్ పెంచుతాం
- ప్రజాశక్తితో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



'రాయలసీమకు తలమానికమైన కర్నూలు జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలతో తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ ఎంతో కీలకమైంది. ప్రతిరోజు 2500 పైగా ఓపిలను 1500 కు పైగా ఇన్ పేషెంట్స్‌ను కలిగి ఉండి వేలాదిమందికి వైద్య సేవలను అందిస్తోంది. ప్రొఫెసర్ నుండి స్వీపర్ దాకా అందర్నీ సమన్వయపరుస్తూ ముందుకెళ్లడం సవాలుతో కూడుకున్నది. అరుదైన ఆపరేషన్ చేస్తున్న వైద్య బృందానికి తన సహాయ సహకారాన్ని అందిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం. తెలంగాణ ప్రాంతాల వారికి ఆరోగ్యశ్రీ లేకపోయినా చికిత్సను, మందులను ఉచితంగా అందిస్తున్నాం. సర్జికల్‌కు సంబంధించినవి మన దగ్గర లేకపోతే వాటిని మాత్రం బయట కొనమని చెప్తున్నాం. బడ్జెట్ సరిపోకపోవడంతో ఇలా చెప్పాల్సి వస్తుంది.' అని కర్నూలు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లుతో ప్రజాశక్తితో ముఖాముఖిగా అనేక అంశాలు వెల్లడించారు.

కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రజలకు ఎన్ని బెడ్స్ అందుబాటులో ఉన్నాయి.

సూపరింటెండెంట్ : కర్నూలు జిజిహెచ్‌లో 1600 ఇన్‌బెడ్స్ వున్నాయి. ఇందులో ఐసియు 200 బెడ్స్, సూపర్ స్పెషాలిటీలో 200 బెడ్స్ ఉంటాయి. ఇవి కాక స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్లో మరొక 200 దాకా బెడ్స్ ఉంటాయి.

మీరు భాధ్యత చేపట్టాక ఎలాంటి మార్పులు తెచ్చారు.

సూపరింటెండెంట్ : మరో సిటీ స్కాన్ ఏర్పాటు చేసాం. ఓపి రద్దీ తగ్గించేందుకు కౌంటర్ల సంఖ్యను పెంచాం. సూపర్ స్పెషాలిటీ ఓపి దగ్గర ప్రత్యేక ఓపి కౌంటర్ ను ఏర్పాటు చేసాము. మాత శిశు సంరక్షణ భవన్ బ్లాక్ లోనే గర్భవతుల సౌకర్యార్థం రెండు అల్ట్రాసౌండ్ మిషన్లు, టీఫా స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభించుకొని ఆపరేషన్స్‌ను నిర్వహిస్తున్నాం. వాహనాల రాకపోకలకు గతంలో ఒక గేటు ఉండేది మరో గేటును ఏర్పాటు చేసాం. ఇఎన్‌టి బెరాటెస్ట్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా నిజమైన వినికిడి సమస్య ఉన్న వారిని గుర్తించడానికి అవకాశం ఉంటుంది. వార్డులు, క్లినికల్ యూనిట్లు, స్కానింగ్ సెంటర్లను తెలిపే డైరెక్షన్ బోర్డ్సును కొత్తగా ఏర్పాటు చేశాం. వైద్యుల సమయపాలనకు అనేక చర్యలు చేపడుతున్నాం.

మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?.

సూపరింటెండెంట్ : క్యాజువాలిటీలో 30 నుంచి 50 బెడ్స్ సంఖ్యకు పెంచి కొత్త ఐసియు బెడ్స్‌ను ఏర్పాటు చేశాం. క్యాజీవాలిటిలో సర్జికల్ యూనిట్ మార్పు చేయించాం. వెంటీలేటర్స్ కొన్నింటిని రిపేరు చేయించి కొత్త వాటిని కొనుగోలు చేసాం. క్యాజువాలిటీలో ఒక వాష్‌రూమ్ వుంటే వెనుకాల ఆరు కొత్త వాష్ రూమ్స్ ఏర్పాటు చేశాం. లిఫ్టును మార్పు చేశాం. కొత్తగా 20 స్ట్రెచ్చర్స్ కొన్నాం. పాత వీల్‌చైర్స్ రిపేర్ చేయించాం. వీల్స్ ఛైర్స్ వీల్స్ త్వరగా చెడిపోతున్నాయి. రూ. రెండు లక్షలు ఖర్చుపెట్టి హాగ్గిస్ ను రిపేర్ చేయించాం. వర్షాకాలంలో జనరేటర్స్ తోటి ప్రస్తుతానికి నిర్వస్తున్నారు. కోకోకోలా కంపెనీ వారి సహకారంతో రెండు మినరల్ వాటర్ ప్లాంట్స్‌ను ఓపి కౌంటర్ సదరన్ క్యాంప్ దగ్గర ఏర్పాటు చేశారు. న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ బ్లాక్‌లో ఆపరేషన్ థియేటర్స్‌లో పున్నర్‌నిర్మాణ పనులు చేపట్టాం. పార్కింగ్ స్థలాలను గుర్తించి సిమెంట్స్ బెడ్స్ వేసాం.

ఓపి కౌంటర్ ఎక్కువ రద్దిని తగ్గించడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు.

సూపరింటెండెంట్ : ఓపి రద్దీని తగ్గించేందుకు అనేక చర్యలు చేపట్టాం. ఓపి దగ్గర ప్రత్యేక కౌంటర్లు పెంచాం. నర్సింగ్ ట్రైనింగ్ ఉపయోగించుకుంటున్నాం. సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్ దగ్గర ప్రత్యేక ఓపికౌంటర్ రూమ్ చేశాం. ఈ హాస్పిటల్ వచ్చిన తర్వాత ప్రతి ఓపిని ఆధార్ కార్డుతో లింక్ చేయడం వల్ల ఆయుష్మాన్ డిజిటల్ భారత్ భాగంగా యుహెచ్ఐ (యూనివర్సల్ హెల్త్ ఐడి) నంబరు ఇస్తారు. అందుకు సమయం పడుతుంది.

సిటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి టెస్టులకు ఎందుకని ఎక్కువ సమయం పడుతుంది ?

సూపరింటెండెంట్ : పాక్స్ సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసాం. దానివల్ల ఎక్సరే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ వంటివి పరీక్షలకు రిపోర్టు, ఫిలిం రావాలంటే చాలా సమయం పడుతుంది. ఈ సాఫ్ట్‌వేర్ వల్ల డాక్టర్ ఫోన్ లోనే వెంటనే చూసుకోవడానికి అవకాశం ఉంటుంది. చికిత్స త్వరగా అందించడానికి అవకాశం ఉంటుంది. మందులు, ఇంజక్షన్లు కొరత లేకుండా ఇండెంట్ పెట్టి తెప్పించుకున్నారు.

కొత్త బిల్డింగుల నిర్మాణ ఆగిపోయింది. ఎందుకని?

సూపరింటెండెంట్ : ఆస్పత్రి నిర్మాణం పనులు బిల్లుల బకాయిలతోటి కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. దీనిని జిల్లా మంత్రి భరత్, వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి టిజీ భరత్ దీనిపై సీరియస్‌గా దృష్టి సారించి ముఖ్య మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పర్యవేక్షకునిగా ఈ బాధ్యతలలో ఎలా ఫీలవుతున్నారు.

సూపరింటెండెంట్: గత 27యేళ్లుగా క్లినికల్ ప్రాక్టీస్ చేస్తునప్పుడు ఎంత కష్టమైన ఆపరేషన్ అయినా చేయగలం కాని అడ్మినిస్ట్రేషన్ అనేది చాలా కఠినతరమైన బాధ్యతతో కూడుకున్నది. స్వీపర్ నుంచి ప్రొఫెసర్ వరకు అందర్నీ మానిటరింగ్ చేయాలి. అందర్నీ సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లడం ఎంతో బాధ్యత ఉంటుంది.

మీ భవిష్యత్తు ప్రణాళిక ఏమిటి

సూపరింటెండెంట్ : అత్యవసర చికిత్సకు క్రిటికల్ కేర్ యూనిట్ బెడ్స్ పెంచడం చాలా అవసరం. బయట రూ.లక్షల విలువ చేసే ఆపరేషన్స్ , అరుదైన ఆపరేషన్లను చిన్న కోతతో కూడా జిజిహెచ్ వైద్యులు నిర్వహిస్తున్నారు. వాటిని మరింత పెంచాలని అందుకు అవసరమైన సహకారం కూడా అందిస్తాం.



నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ మండలం మున్సిపల్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామి పేర్కొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

104 సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు కోరారు. కార్మిక కర్షక భవన్‌లో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కార్మిక కర్షక భవనం ఆవరణలో నిరసన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ప్రజా సంజీవినిగా పేరు తెచ్చుకున్న 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలుచేస్తున్నారని తెలిపారు. అరబిందో కంపెనీ నుండి రావలసిన బకాయిలు, గ్రాడ్యుటి, ఎర్నుడ్ లీవ్ డబ్బులు విషయంలో అన్యాయం జరిగిందని, ప్రభుత్వం స్పందించి అరబిందో నుంచి రావలసిన బకాయలు ఇప్పించాలని కోరారు. ప్రస్తుత యాజమాన్యం ఇప్పటివరకు నియామక పత్రాలు గాని ప్లే షిప్స్ గాని ఉద్యోగులకు అందజేయలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యూనియన్ ప్రతినిధులను పిలిచి యాజమాన్యం అధికారులు యూనియన్ నాయకుల చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎటువంటి అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మందుల నిర్వహణ బాధ్యతనుండి తప్పించాలని కోరారు. జీతాలు వ్యత్యాసం సవరించి ఇప్పటివరకు కోత విధించిన డబ్బులు అరియర్స్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శికి ఇచ్చిన సోకాజ్ నోటీసుల మీద పునరాలోచన చేయాలని కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు కనీస వేతనం రూ.18,500 పెంచాలని కోరారు. ప్రతి డివిజన్ కు ఒక బఫర్ సిబ్బందిని నియమించాలని కోరారు. క్యాజువల్ లీవ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ ,యూనియన్ నాయకులు ఇలియాజ్, మల్లికార్జున, జోజప్ప, ఏసన్న, రాఘవేంద్ర, అశోక్, అయ్యప్ప, ఓబులేసు, మళ్ళికల్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు. జోజప్ప, ఈసన్న, రాఘవేంద్ర ,అశోక్, అయ్యప్ప, ఓబులేసు, మళ్ళికల్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

నేడు నూతన విత్తన చట్టాల బిల్లు ప్రతుల దహనం

-కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో 2025వ సంవత్సరం విత్తన చట్టాన్ని విద్యుత్ చట్టాన్ని తీసుకువచ్చి రైతుల పైన భారాలను మోపుతున్న చట్టాలను నిరసిస్తూ ఈనెల 8న బిల్లు జీవో కాపీలను దహనం చేయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు బొల్లవరం వెంకటస్వామి, సుగ్గన్న, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్ ఒక సంయుక్త ప్రకటనలు పేర్కొన్నారు. నరేంద్ర మోడీ మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం పైన విరుచుకుపడి వ్యవసాయాన్ని నష్టాలలోకి తీసుకుపోతున్నారన్నారు. పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు దేశీయ విదేశీయ వ్యాపార వర్గాలకు లాభం చేకూర్చే విధానాల అవలంబిస్తున్నారన్నారు. ఇప్పటికే విత్తన చట్టాలు చాలా ఉన్నాయని, 66 రకాల విత్తన చట్టాలు ఉన్నాయని, ఈ చట్టాలు సరిపోవడం లేదని రైతులకు నష్టం కలిగించే విధంగా, కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా నూతన చట్టాలను తీసుకువస్తున్నారన్నారు. ఈ చట్టం వల్ల రైతు తన పొలంలో పండించే విత్తనాన్ని వాడకూడదని, వ్యాపార వర్గాల ద్వారా కొన్ని విత్తనమే వాడాలన్నారు. ఇది ఈ విత్తనం ఒకసారి వాడిన తర్వాత మళ్లీ ఇదే విత్తనాన్ని వాడడానికి అవకాశం ఉండదన్నారు. గుత్త కంపెనీలకు తమ విత్తనాలను ఎక్కడైనా ఎప్పుడైనా ఏ ధరకైనా అమ్ముకునే వీలు కల్పిస్తున్నారన్నారు. దీని ద్వారా రైతులు రైతులు పండించిన విత్తనాలను తాము వాడుకోలేక వ్యాపారస్తుల దగ్గర తప్పనిసరిగా అధిక ధర చెల్లించి కొనాల్సి వస్తుందన్నారు. ఈ విత్తనాల వల్ల ఎంత మోసం జరిగినా ఎవర్ని ప్రశ్నించడానికి వీలు లేదన్నారు. నాణ్యతలేని విత్తనాలు వ్యాపారస్తులమ్మితే కూడా రైతులు కొనవలసి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో నూతన విత్తన, విద్యుత్ చట్టాలు భారతదేశ వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తాయని, దేశ ఆర్థిక పరిస్థితిని దెబ్బతిస్తుందని రైతులు, రైతు కూలీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నూతనంగా తెచ్చే విత్తన బిల్లు అక్కర్లేదని ఈనెల 8న కర్నూలు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఈ బిల్లుల ప్రతులను దహనం చేయబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, రైతు కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైద్య విద్యలో నిరంతర శోధన అవసరం

- కెఎంసిలో ప్రోస్టేట్ క్యాన్సర్‌పై సిఎంఇ
- కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

వైద్య విద్యలో నిరంతరం పరి శోధన చేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ సూచన చేశారు. ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్ గ్యాలరీలో యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రోస్టేట్ క్యాన్సర్‌పై సిఎంఇ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా సీఎంఇలు నిర్వహించడం ద్వారా నాలెడ్జిని అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రారంభ దశలోనే ప్రోస్టేట్ క్యాన్సర్‌ను గుర్తిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఎడిఎంఇ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రోస్టేట్ క్యాన్సర్‌కు ఉత్తమ వైద్యం అందిస్తున్నామని, పురుషులు ప్రోస్ట్రేట్ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ముత్యశ్రీ మాట్లాడుతూ 60 సంవత్సరాలు వయసు దాటిన పురుషుల్లో ప్రోస్ట్రేట్ క్యాన్సర్ సాధారణంగా మారిందని అయితే సర్జరీ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ సేపూరి బాల రవితేజ మాట్లాడుతూ ప్రోస్టేట్ క్యాన్సర్ లాప్రోస్కోపీ విధానంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాయలసీమ మొత్తంలో ఒక్క కర్నూలు జిజిహెచ్‌లోనే చేస్తున్నామన్నారు. పేర్కొంటూ ప్రోస్టేట్ క్యాన్సర్‌లో ఉన్న సర్జరీ విధానాల గురించి వివరించారు. అపోలో హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ సంజయ్ అడ్డాల మెటాస్టాటిక్ ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన కలిగించారు. స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ శివ ప్రసాద్‌లు ప్రోస్టేట్ క్యాన్సర్ గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ వైద్యులు ప్రముఖ యూరాలజిస్టులు డాక్టర్ ఎవిఎస్ రెడ్డి, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

-కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని అశోక్ నగర్ పాలకొట్టాలు లేబర్ కాలనీలో సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నగర అధ్యక్షులు నగేష్ అధ్యక్షతన కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా నాయకులు రాముడు, నగర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఐదేళ్ల నుండి లేబర్ చట్టాలను రద్దుచేసి లేబర్ కోడులను ప్రవేశపెట్టడానికి అనేక సార్లు ప్రయత్నం చేసినప్పటికీ కార్మిక వర్గం తిప్పి కొట్టిందన్నారు. ఎట్టకేలకు బీహార్ ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా లేబర్ కోడ్లను నోటిఫై చేస్తూ నవంబర్ 21న సర్క్యులర్ జారీ చేసిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున వీధుల్లోకొచ్చి ఉద్యమించినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు ఉద్యోగ భద్రత, కార్మికులకు చెందిన అనేక హక్కులు మొత్తంగా 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ప్రవేశపెట్టడం ద్వారా కార్మికుల ఉన్న హక్కులన్నీ కోల్పోయి యజమానులకు బానిసలుగా మారే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈనెల 31నుంచి జనవరి 4 వరకు మహాసభలు నిర్వహిస్తారని, 4న భారీ ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. 4న భారీ బహిరంగ సభ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు న్యూ సిటీ కోశాధికారి సాయిబాబా, ఉపాధ్యక్షులు సుధాకరప్ప, యేసు రాజు, సహాయ కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు భాస్కర్, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు మళ్లీ ,చాంద్ బాషా, అశోక్, శంకర్, సీతారాం నగర్ హమాలి యూనియన్ నాయకులు గోవిందు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వేదిక్ మ్యాథ్స్‌లో న్యూ విశ్వవాణి స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

- వరుసగా రెండో ఏడాది ఫస్ట్ ప్రైజ్

ప్రజాశక్తి- కోడుమూరు

కర్నూలులో జరిగిన జోనల్ లెవల్ వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో కోడుమూరు పట్టణానికి చెందిన న్యూ విశ్వవాణి స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఆదివారం కర్నూలు నగరంలోని సెయింట్ జోసఫ్ స్కూలులో జరిగిన ఈ పోటీల్లో న్యూ విశ్వవాణి స్కూల్‌కు చెందిన 6వ తరగతి చదువుతున్న బండ మాధవ్ ప్రథమ, 7వ తరగతి చదువుతున్న కార్తీక్ అనే విద్యార్థికి , ద్వితీయ బహుమతులు లభించాయి. 8వ తరగతి చదువుతున్న గణేష్ అనే విద్యార్థికి ప్రథమ బహుమతి లభించిందని స్కూల్ కరస్పాండెంట్ ఖలీల్, హెడ్మాస్టర్ గిడ్డయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు మొదటి నుంచి గణితంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వేదిక్ , అబాకస్ వంటి గణితంలో విద్యార్థులకు మెలుకులు నేర్పించి ఇలాంటి కాంపిటీటివ్ పరీక్షల్లో పాల్గొనేలా చేస్తామని స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయినీలు కల్పన, జకియా, రెహనా, సంధ్య, హరిత ఉన్నారు.

ఎస్‌పిజి చర్చిలో క్రిస్మస్ నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్థానిక ఎస్‌పిజి కాంపౌండ్‌లోని క్రైస్ట్ చర్చ్ ఆవరణలో ఆదివారం ఉదయం ప్రార్థనల అనంతరం సండే స్కూల్ విద్యార్థులు క్రిస్మస్ కు స్వాగతం పలుకుతూ నృత్య ప్రదర్శన చేశారు. ఏసు క్రీస్తు ఈ లోకానికి రక్షకుడుగా వచ్చాడని తెలుపుతూ వారు నృత్య ప్రదర్శన నిర్వహించారు. సండే స్కూల్, యూత్ తమ బృందంతో క్రీస్తు పాటలు ఆలపించి చూపరులకు కనువిందు చేశారు. అంతకు ముందు పాస్టర్ మేకల రాజేంద్ర ప్రార్థనతో ప్రారంభించారు. సండే స్కూల్ సూపరింటేడెంట్ శారద, ఉపాధ్యాయులు శాంతి, పద్మ , ఉమ, వసంత, లీలావతి పాస్టర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగ స్వామి నాయక్‌కు విజినరీ అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వొకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్ విజనరీ-2025 అవార్డు ను ఆదివారం అందుకున్నారు. వెలుగోడులో నిర్వహించిన కార్యక్రమంలో విజనరీ-2025 అవార్డును యుఎస్ఎ అమెజాన్ ప్రాడక్ట్ మేనేజర్ జివి. రామమోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. విద్యారంగంలో ఆయన చేస్తున్నటువంటి ఎనలేని సేవలకు గుర్తించి ఏ వార్డును అందజేసినట్లు జివి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. వెంకప్ప కోటి బసవరాజు, స్వామి తదితరులు ఉన్నారు.



విజనరి అవార్డును అందుకున్న కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని జిల్లా సాధనకు ఆందోళన ఉధృతం

-10న ఆదోని పట్టణ బంద్
-నియోజకవర్గ కేంద్రాలలో దీక్షలు
-మంత్రి వర్గాన్ని కలిసి విన్నవించడం
- జిల్లా సాధనకు రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నూర్ మహ్మద్

ప్రజాశక్తి-ఆదోని : జిల్లా సాధన తోనే ఆదోని సమగ్ర అభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సంపూర్ణ ఉద్యమాలతోనే ప్రభుత్వం దిగి వస్తుందని ఆ దిశగా పోరాటం నిర్వహించాలని అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఆదివారం ద్వారక హోటల్లో అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.ఆదోని జిల్లా ఏర్పాటులో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ ఆదోని జిల్లా సాధన జెఏసి ఆధ్వర్యంలో బుధవారం, ఈనెల 10న ఆదోని పట్టణ బంద్కు పిలుపు నిచ్చారు. దుకాణాలు, హోటళ్లు, విద్యా సంస్థలు, మార్కెట్లు, ఆటోలు, రవాణా, వాణిజ్య అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల కార్యాలయాలు స్వచ్ఛందంగా మూసివేసి ఆదోని పట్టణ బంద్ పాటించి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదోని జిల్లా డిమాండ్ కోసం తమ వంతు బాధ్యత పోషించాలని ఆదోని జిల్లా సాధన జెఏసి నాయకులు విజ్ఞప్తి చేశారు. మరో మూడు రోజులలో ఆదోని ప్రాంత అన్ని నియోజకవర్గ కేంద్రాలలో దీక్షలు ప్రారంభించాలని జెఏసి నాయకులు సమావేశంలో తీర్మానించారు. మరో మూడు రోజుల్లో ఆదోని జిల్లా డిమాండ్తో మంత్రి వర్గాన్ని కలవడానికి కూడా తీర్మానం చేశారు. ఆదోని జిల్లా సాధన జెఏసి నాయకులు రఘురామయ్య, లలిత, నూర్అహ్మద్, ఆశోకానందరెడ్డి, వీరేష్, కోదండ, విరుపాక్షి, దస్తగిరి నాయుడు వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు నాగరాజు, వీరేంద్ర యాదవ్, శ్రీనివాసాచారి, సాయిరాం, సాయి, జనసేన నాయకులు పులిరాజు జయరాం పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం ఆ రోడ్డు

- అధికారుల నిర్లక్ష్యం - మారని రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనికి కూత వేటు దూరంలో ఉన్న పర్వతాపురం కాలనీ నిర్లక్ష్యానికి గురవుతుంది. పర్వతాపురంలో సుమారు వెయ్యి జనాభా నివాసం ఉంటుంది. పేరుకే మున్సిపాలిటీ అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల కన్నా సదుపాయాల లోపం తీవ్రంగా నెలకొంది. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించే అధికారులే లేరని ఆ కాలనీవాసులు వాపోతున్నారు.

శివారు ప్రాంతాల పట్ల నిర్లక్ష్యం : ఆదోని మున్సిపాలిటీ పరిధిలో శివారు ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. పాలకులు మారినా సమస్యలు పరిష్కారం కావడం లేదని శివారు ప్రాంతాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఇప్పటివరకు కన్నెత్తి చూసిన పాపాన పోలేదంటూ విమర్శిస్తున్నారు. అమరావతి నగర్లోనే కొత్త కాలనీ, రాజా సాహెబ్ నగర్, దేవినగర్, వైయస్సార్ నగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచి ఇళ్ల మధ్య బురద మయంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అడిగిన ప్రతిసారి రోడ్లు మంజూరు అయ్యాయని డ్రైనేజీ కాల్వలు వేయిస్తామని అధికారులు చెబుతున్నారే తప్పా పని చేయించిన దాఖలాలు లేవంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. పన్నుల రూపంలో సుమారు రూ 18 కోట్ల వరకు వసూళ్లు చేస్తున్నారని, వీటితో రాజకీయ నాయకుల నివాసాలు వద్ద, బడా వ్యాపారులు ఉండే కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ కాల్వలు వేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.


గుంతల మయంగా పర్వతాపురం రోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నాయి : వెంకటేష్, కాలనీ వాసి

ఆదోని నుండి కాలనీకి వెళ్లే సమయంలో గుంతలు గమనించక బైకులు అదుపుతప్పి చాలా మంది కిందపడి గాయాల పాలయ్యారు. వీధిలైట్లు లేని కారణంగా గుంతలు కనపడవు. గుంతలను కనీసం గ్రావెల్తోనైనా పూడ్చాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్వతాపురం రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. లేని ఎడల గ్రామస్తులను సమీకరించి ఆందోళన నిర్వహిస్తాం.

సమస్య పరిష్కారానికి కృషి
- నసీర్ హుసేన్, ఇన్ఛార్జి మున్సిపల్ కమిషనర్

శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. రూ. లక్షల విలువ గల పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం సైతం పూర్తైంది. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో కొంత ఆలస్యం అవుతోంది. త్వరలోనే శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు చేపడతాం.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు
- శ్రీనివాసులు, కాలనీ వాసి

పర్వతాపురం కాలనీ నుంచి ఆదోనికి రాకపోకలు సాగించాలంటే అధ్వాన రోడ్డుతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చదువు నిమిత్తం విద్యార్థులు ఆదోనికి సైకిళ్లపై వస్తున్నారు. గుంతలు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి కింద పడిపోతున్నారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలి. లేని ఎడల విద్యార్థులను సమీకరించి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తాం.

రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

-సిపిఐ ప్రచారజీపుజాత ప్రారంభం
-10 న ఆస్పరికి సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ రాక

ప్రజాశక్తి ఆస్పరి


జెండా ఊపి ప్రచారజీపు జాతాను ప్రారంభిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అధిక వర్షాలు కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండల వ్యాప్త ప్రచార జీపు జాతాను ప్రారంభించి గిడ్డయ్య మాట్లాడారు. ఈ నెల 10 న ఆస్పరిలో జరిగే రోడ్డు దిగ్బంధన కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని తెలిపారు. రైతులు, కార్యకర్తలు, రైతు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. జిల్లాలో రైతులు పండించిన ఉల్లి, టమోటా, పత్తి, వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధరలు లేక పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పత్తి రైతుల బాధలు వర్ణనాతీతమని అన్నారు. రైతులు పత్తి పంటను అమ్ము కోవడం చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు.సిసిఐ ద్వారా పత్తిని కొనుగోలు చేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రకరకాల షరతులతో రైతులను వేదిస్తున్నారన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి రమేష్, రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు అంజనేయ, అధ్యక్షులు బడేసాబు, సీనియర్ నాయకులు రామాంజిని, ధనుంజయ, నల్లన్న,నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు నిర్వహించే సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి. గోవిందు, బి రాముడు తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్లో మహాసభల పోస్టర్ను వారు ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. భారతదేశంలో 1970లో సిఐటియు ఏర్పడ్డ తర్వాత ఆంధ్ర రాష్ట్రంలో సిఐటియు జాతీయ మహాసభలు విశాఖపట్నంలో జరగడం గర్వకారణం అన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేటేష్ శక్తులకు దాసోహం అంటుందన్నారు. పోరాడి సాధించుకున్న 29 రకాల చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులకు నష్టం తెచ్చిందన్నారు. సిఐటియు దేశవ్యాప్త పోరాటాలకు ఈ మహాసభ వేదిక అవుతుందన్నారు. సిఐటియు 18వ అఖిలభారత మహాసభలకు ఉద్యోగ, కార్మిక, కర్షక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె. నాగరాజు, యు రమేష్, ఎ. సురేష్, ఎస్. నాగలక్ష్మి, డి ఉస్మానువలి, కె మంజుల, బి తిమ్మప్ప, బి.గోపాల్, పి రాజు, బాష, ఎం రమేష్ పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్ను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు రామాంజనేయులు

నవోదయలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జవహర్ నవోదయ విద్యాలయ బనవాసిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కడప జిల్లా జడ్జి మొదటి బ్యాచ్ విద్యార్థి ప్రవీణ్ కుమార్తోపాటు 150 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఏపీజే అబ్దుల్ కలాం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, శ్రీనివాస రామానుజన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, అలాగే విద్యాలయ మొదటి ప్రిన్సిపల్ కీర్తిశేషులు రెడ్డప్పల విగ్రహాలను వారు ఆవిష్కరించారు. రెడ్డప్ప గారి భార్య లలితమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు రెడ్డప్ప గారి సేవలను కొనియాడారు. తరువాత పూర్వ విద్యార్థులు తమ బాల్యాన్ని గుర్తుచేసుకొని వారి అమూల్యమైన అనుభవాలను, సందేశాలను విద్యార్థులతో పంచుకున్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఇ. పద్మావతి మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధిలో సహాపడుతున్న పూర్వ విద్యార్థులకు కృతజ్ఞత తెలిపారపు. పూర్వ విద్యార్థులు జూనియర్ బాయ్స్, గర్ల్సకు సోలార్ వాటర్ హీటర్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యాలయ వైస్-ప్రిన్సిపల్, అబ్దుల్ రహమాన్, కాట్రగడ్డ వెంకటేశ్వర్లు, జగన్నాథ్, శిరీష, బసవరాజ్, వెంకటేష్, శశికిరణ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



నవోదయ విద్యాలయ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అధికారులు, అతిథులు

రాఘవేంద్రుని సన్నిధిలో కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో ఆదివారం కోలాహలం నెలకొంది. స్వామి వారి దర్శనార్థమై వచ్చిన భక్తులకు తుంగభద్ర నది తీరంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా దర్శన అవకాశం కల్పించారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నీ ఏర్పాట్లు చేశారు.


మంత్రాలయానికి భారీగా వచ్చిన యాత్రికులు


మంచినీటి సంపు పై స్లాబు వేస్తున్న దశ్యం

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు

-సర్పంచి కరివేముల సావిత్రి

ప్రజాశక్తి-చిప్పగిరి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని సర్పంచి కరివేముల సావిత్రి తెలిపారు. ఆదివారం బెల్డోన గ్రామంలో మంచి నీటి సంపుపై ఉన్న స్లాబు అంతా కూడా పడిపోవడంతో మరల స్లాబు వేయడానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.మూడు లక్షలతో పనులు చేపట్టే కార్యక్రమం చేపట్టారు. పంప్సెట్ ఉండే భవనం స్లాబు కూడా వేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో ప్రాధాన్యత ఉన్న పనులన్నీ కూడా వేగవంతంగా పూర్తి చేయిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలో సరిగా పనులు జరగలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామపంచాయతీలలో ప్రాధాన్యత ఉన్న అభివృద్ధి పనులు అన్ని కూడా పూర్తి చేస్తున్నామన్నారు. సర్పంచి భర్త కరివేముల గోవిందు, కాంట్రాక్టర్ రంగస్వామి పాల్గొన్నారు.

జోనల్ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండోర్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొని ప్రతిభ చాటారు. క్రీడలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత పెంపొందుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైఫుల్ల, కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ మల్లికార్జున విద్యాలయ ఆవరణలో ఆదివారం జోనల్ స్థాయి ఇండోర్ ఆటల పోటీల్లో రూబిక్ క్యూబ్, ఎలక్యూషన్, చెస్, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ముందుగా ఎంఇఒ భూపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో కిడ్డీస్ మొదటి బహుమతి, రెండో బహుమతి అమరావతి పాఠశాల, మూడో బహుమతి అక్షరశ్రీ, రూబిక్ క్యూబ్లో మొదటి బహుమతి చిన్నయ విద్యాలయ వీక్షిత్, రెండో బహుమతి నేషనల్ స్కూల్ రిహాన్, మూడోవ బహుమతి సెయింట్ జోష్ గణేష్, చెస్ గర్ల్సలో మొదటి బహుమతి చిన్మయ విద్యాలయ ప్రతిక్ష, రెండవ బహుమతి మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ స్కూల్ విద్యార్థిని రిజ్వాన, చెస్ సబ్ జూనియర్ అస్మిత కిడ్డీస్ రూట్, సమీరా మహమ్మద్ లీలాస్, సాయి వైష్ణవి బాయి లీలాస్, ఎలిక్యులేషన్ అక్షర శ్రీ వెంకట సాయి, స్టోన్ హిల్స్ మిధున, నేషనల్ హై స్కూల్ విద్యార్థిని యామిని, డ్రాయింగ్లో అక్షరశ్రీ విద్యార్థిని అక్షయ, లీలా పాఠశాల విద్యార్థిని సోనాక్షి, కిషన్, వీరితోపాటు సీనియర్, జూనియర్ విభాగంలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు రోటరీ క్లబ్ సర్టిఫికెట్లతోపాటు మెడల్స్ను అందజేశారు. రోటరీ క్లబ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల బృందం పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ యూత్ ఆఫీసర్ సాబీర్ అహ్మద్, ట్రెజరర్ షణ్ముఖ, సభ్యులు జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, ప్రశాంత్ గాంధీ, భరత్, శ్రీధర్ రెడ్డి, విట్ట మురళీధర్, రాచోటి సుబ్బయ్య, పద్మనాభయ్య శెట్టి, వికాస్ బండారి, సందీప్ రెడ్డి, హుస్సేన్ బాష, శివకుమార్, శేషయ్య, నితిన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.




ఆస్పరిలో బస్సులకు అడ్డంగా ఆగిన ఆటోలు, బైకులు

ఆస్పరి చౌరస్తాలో ట్రాఫిక్కు అతరాయం

రోడ్డు పై అడ్డంగా ఆపుతున్న ఆటోలు

ప్రజాశక్తి-ఆస్పరి

ఆస్పరి చౌరస్తాలో నాలుగు వైపులా రోడ్లపై ఆటో డ్రైవర్లు అడ్డంగా ఆటోలు నిలుపుతుండడంతో ట్రాఫిక్కు అంతరాయం కలుగుతుంది. రాయచూర్ నుండి బెంగళూరు, కర్నాటకకు హేవి వాహనాలు అంబేద్కర్ సర్కిల్ ముందుగా వెళ్తాయి. సర్కిల్లో ఆటోలు ఆపడంతో కటింగ్ కాక బస్సులు, పెద్ద వాహనాలు సైడ్ వెళ్లడానికి కూడా వీలులేకుండా, బస్సులు ఆపడానికి లేకుండా నిలుపుతున్నారు. పోలీసులు స్పందించి చౌరస్తాలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నిబంధనలు పాటించేలా ఆటో డ్రైవర్లను హెచ్చరించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల పరిధిలోని సూగూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కురువ చిన్న నాగప్ప(30) కుటుంబానికి నియోజకవర్గ ఇన్ఛార్జీ ఎన్ రాఘవేంద్ర రెడ్డి సోదరులు, మాధవరం గ్రామ మాజీ సర్పంచి ఎన్ రఘునాథ్ రెడ్డిలు ఆదివారం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. చిన్న నాగప్ప అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని ఎల్ఎల్ఐడిసి-5 ఛైర్మన్ బోయ నరసింహ రాఘవేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తన సోదరులను సూగూరు గ్రామానికి పంపించారు. ఆయన కురువ చిన్న నాగప్ప భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మృతుడి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ. 10 వేల నగదును అందజేశారు. మృతుడి కుటుంబానికి ఎప్పుడూతోడుగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు భాస్కర్ రెడ్డి, హనుమంతు, గోపాల్, శేఖర్, రజాక్, బొజ్జప్ప, ఇజ్రాయిల్, నాగరాజు, అల్లింగ, రవి కార్యకర్తలు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఆదోని



పోస్టర్ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలకు సంసిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చెయ్యాలని ఆదోని సిఐటియు కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు సంజయ్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలు తిరుపతి నగరంలో డిసెంబర్ 12,13,14 తేదీలలో నిర్వహిస్తున్నమన్నారు. డిసెంబర్ 12న ర్యాలీ బహిరంగ సభ ఇందిర మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వేలాదిగా విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుండి 500 మంది ప్రతినిధులు పాల్గొని రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై రాష్ట్ర విద్యారంగా అభివద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తామని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన శాఖ మినహా అన్ని శాఖల పనులు చేస్తున్నారని విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసారని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలు కోసం ఆలోచించడం లేదని అన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని జూనియర్ డిగ్రీ కళాశాల కళాశాలల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు ఈ సమస్యలన్నింటిలపై 25వ రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామని తెలియజేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మెడికల్ కాలేజీల సీట్ల అమ్మకానికి వ్యతిరేకించి నేడు అధికారంలోకి వచ్చాక అవే మెడికల్ కాలేజీలను 100శాతం ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా అమ్మడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. జీవో నెంబర్ 117 రద్దుచేసి స్కూల్స్ మూసివేత ఆపుతామని చెప్పి ఎన్నికల్లో హామీ ఇచ్చి నేడు యథేచ్ఛగా స్కూల్స్ ను మూసేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహాసభల్లో తీర్మానాలు చేసి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించి పనిచేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ,జగన్,ఉత్తేజ్, నాగరాజు, కార్తీక్, మహేష్ పాల్గొన్నారు.

తాగునీరు అందేలా చర్యలు

కర్నూలు మండలం ఆర్డబ్ల్యూఎస్ ఎఇ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలంలో ప్రతి ఒక్కరికి తాగునీరు అందేలా చర్యలు చేపడుతున్నామని కర్నూలు మండల ఆర్ డబ్ల్యూ ఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ కె.రంగస్వామి తెలిపారు. జీవన్ మిషన్ (జెజెఎం) పథకం కింద మండలంలోని ఉల్చాల గ్రామంలో 90 వేల లీటర్ల ఒహెచ్ఎస్ఆర్ను, సింగవరంలో రూ. 13 లక్షలతో, దొడ్డిపాడులో రూ.తొమ్మిది లక్షలతో పైప్ లైన్ పనులను పూర్తి చేశామన్నారు. ప్యాకేజీ కింద తొలిశాపురం, బసవాపురం, దేవమాడ, దిగువపాడు, సింగవరం పైప్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిడ్జూరు, గొందిపర్లలో వరుసగా 40 వేలు, 90 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు.

ఆయుర్వేద డిస్పెన్సరీ అభివృద్ధికి ఎమ్మెల్యే కెఇ హామీ

వైద్యాధికారి డాక్టర్ అమర్నాథ్

ప్రజాశక్తి-పత్తికొండ

మండల కేంద్రమైన తుగ్గలిలో ఉండే ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే కెఈ శ్యాం కుమార్ హామీ ఇచ్చినట్లు తుగ్గలి ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ వైద్యాధికారి డాక్టర్ అమర్నాథ్ తెలిపారు. డాక్టర్ అమర్నాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిశానన్నారు. తుగ్గలిలో ఉండే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేద డిస్పెన్సరీని ప్రస్తుతం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ కు తెలిపారు. తుగ్గలిలో ఆయుర్వేద డిస్పెన్సరీకి సొంతభవనం నిర్మించేందుకు స్థలం చూపాలని ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ కు తెలిపారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ తుగ్గలిలో ఆయుర్వేద డిస్పెన్సరీ భవనం నిర్మాణాలకు అవసరమైన నిధులు కోసం కృషిచేస్తామన్నారని తెలిపారు. ఆయుర్వేద డిస్పెన్సరీకి ప్రభుత్వం అన్ని రకాల ఆయుర్వేద మందులను సరఫరా చేసిందన్నారు. అందువల్ల ఆయుర్వేద వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అమర్నాథ్ కోరారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వండి

ప్రజాశక్తి - ఆస్పరి : టిడిపి అభివృద్ధికి కృషి చేస్తున్న ఆస్పరి మండల నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని టిడిపి మాజీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సంజప్ప, బీసీ సంఘం మండల కన్వీనర్ ఉరుకుందు, నాయకులు రంగనాథ్, సతీష్ కుమార్, మహేష్ అన్నారు. స్థానిక గాంధీ పార్క్ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని, గత వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి కార్యక్రమాన్ని ముందు ఉండి చేశామని, మాపై కేసులు పెట్టిన బెదరలేదన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపు కోసం ఎంతో కృషి చేశామన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు ఈశ్వర్, ఉషేని, వలమప్ప, తెల్లాయప్ప, శేఖర్, మాజీ బూత్ కన్వీనర్ రాజు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచాని రాజేంద్ర ప్రసాద్ మృతి విచారకరం : కోట్ల


మాచాని రాజేంద్రప్రసాద్ భౌతిక కాయానికి కోట్ల నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రముఖ పారిశ్రామికవేత్త కీర్తిశేషులు మాచాని సోమన్న (కర్నూలు సోమన్న ధణి) పెద్ద కుమారుడు మాచాని రాజేంద్రప్రసాద్ ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఎమ్మిగనూరుకు చేరుకొని మాచాని రాజేంద్రప్రసాద్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. చేనేతల అభివృద్ధికి మాచాని సోమన్న కుటుంబం అందించిన సేవలను కొనియాడారు. కోట్ల వెంట నివాళులర్పించిన వారిలో ఎమ్మిగనూరు టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మల్కాపురం పురుషోత్తమ రెడ్డి, మంత్రాలయం నియోజకవర్గం నాయకులు మురళీకృష్ణం రాజు (కోసిగి దొర), కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచి మాణిక్య రాజు తదితరులు ఉన్నారు.